సాక్షి
రాజన్న సిరిసిల్ల
మంగళవారం । 29 । జూలై । 2025

వైభవంగా మహాలింగార్చన



వేములవాడ: రాజన్న ఆలయంలో శ్రావణ సోమవారం సందర్భంగా స్వామి వారి అద్దాల మంటపంలో రాత్రి మహాలింగార్చన వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

గరిష్టం/కనిష్టం
31.0/25.0

వాతావరణం
ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

బాధితులకు భరోసాగా గ్రీవెన్స్ డే

- ఎస్పీ మహేశ్ బి గీతే



సిరిసిల్లక్రైం: సమస్యల పరిష్కార లక్ష్యంగా, బాధితులకు భరోసాగా ఉండేందుకు జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతీ సోమవారం గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు ఎస్పీ మహేశ్ బి గీతే పేర్కొన్నారు. వివిధ సమస్యలపై 25 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. ఫిర్యాదులను పరిష్కరించాల్సిందిగా ఆయా పోలీస్‌స్టేషన్ల అధికారులను ఆదేశించారు. అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు.

గల్ఫ్ కార్మిక కుటుంబాలను ఆదుకోవాలి



ముస్తాబాద్(సిరిసిల్ల): గల్ఫ్‌కార్మిక కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని గల్ఫ్ కార్మిక సంఘం జేఏసీ నాయకులు పర్ష తిరుపతి, జనగామ శ్రీనివాస్ బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపికి సోమవారం విన్నవించారు. జిల్లా నుంచి వేలాది మంది దుబాయ్, షార్జా, బహ్రెయిన్, ఒమన్ దేశాలకు వలస వెళ్లి ఇబ్బందులు పడుతున్నారన్నారు. గల్ఫ్‌లో మోసాలకు గురైన వారిని ఆదుకోవాలని కోరారు. గల్ఫ్ వెళ్లే వారికి స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా ప్రత్యేక శిక్షణ ఇచ్చేలా చొరవ చూపాలని కోరారు.


అన్నదానానికి రూ.లక్ష విరాళం



వేములవాడ: నిజామాబాద్ పట్టణానికి చెందిన మమత–రాజేందర్ దంపతులు తమ కుమార్తె జి.రష్మిక పేరిట రాజన్న నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రూ.లక్ష విరాళంగా ఆలయ ఏఈవో శ్రవణ్‌కుమార్‌కు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వారికి స్వామి వారి ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించి, ప్రసాదాలు అందజేశారు.

నేడు గోశాలలో వనమహోత్సవం
రాజన్న గోశాలలో ఆలయ ఉద్యోగులు మంగళవారం వనమహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఈవో రాధాభాయి తెలిపారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా హాజరవుతారని చెప్పారు.

అన్నపూర్ణలో 1.27 టీఎంసీలు



ఇల్లంతకుంట: అనంతగిరి అన్నపూర్ణ జలాశయంలో 1.27 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు ప్రాజెక్టు అధికారులు సోమవారం తెలిపారు. ప్రాజెక్టులోకి 100 క్యూసెక్కుల వర్షపు నీరు వచ్చి చేరుతోందని 20 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో వెళ్తోందని పేర్కొన్నారు.

కాంట్రాక్ట్ డాక్టర్ల నియామకం

సిరిసిల్లకల్చరల్: కాంట్రాక్ట్ ప్రాతిపదికన వైద్యుల నియామక ప్రక్రియను సోమవారం చేపట్టారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధ్యక్షతన మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ జె.రాజేశ్వరీ సమక్షంలో మౌఖిక పరీక్షలు నిర్వహించారు. ప్రొఫెసర్ 1, అసోసియేట్ ప్రొఫెసర్ 2, అసిస్టెంట్ ప్రొఫెసర్లు 6 పోస్టులతోపాటు మరో ఆరుగురిని రెసిడెంట్ డాక్టర్లుగా నియమించారు. మొత్తం 15 మంది వైద్యులతోపాటు ఒక సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టును భర్తీ చేశారు.

ఉమెన్స్ కిక్ బాక్సింగ్‌లో ప్రతిభ



సిరిసిల్లటౌన్: ఉమెన్స్ కిక్ బాక్సింగ్ లీగ్‌లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చూపారు. ఈనెల 26, 27 తేదీల్లో హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ఖేలో ఇండియా కిక్ బాక్సింగ్ ఉమెన్స్ లీగ్‌లో జిల్లా స్పోర్ట్స్ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ బాక్సర్లు మాస్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పాల్గొన్నారు. 6 బంగారు పతకాలు, 4 వెండి, 5 కాంస్య పతకాలు సాధించారని జిల్లా అసోసియేషన్ జనరల్ సెక్రటరీ వొద్నాల శ్రీనివాస్ తెలిపారు.

కంపుకొడుతున్నాయ్..



ఇది ముస్తాబాద్ మండల కేంద్రం శివారులోని దంపింగ్‌యార్డు. మండల కేంద్రం నుంచి సిద్దిపేట దారిలో పెద్దచెరువు కింద ఉంది. దీనికి సమీపంలోనే ఒడ్డెరకాలనీ, ఎస్సీ కాలనీలు ఉంటాయి. దీని నుంచి వస్తున్న దుర్వాసనతో వారు ఇబ్బందిపడుతున్నారు. గతంలోనూ ఆ కాలనీవాసులు దంపింగ్‌యార్డు ఎత్తివేయాలని నిరసనకు దిగారు.



పందులు సంచరిస్తున్న ఈ ప్రాంతం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ కాలనీ. స్థానికంగా పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించకపోవడంతో పందులు, కుక్కలు సంచరిస్తున్నాయి. పందులను ఊరుదాటించాలని ప్రజలు చేసిన విన్నపాలను ఎవరూ పట్టించుకోవడం లేదు.



ఇది ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లో పేరుకుపోయిన డ్రైనేజీ. గ్రామంలో మురికినీటి కాల్వలను పంచాయతీ సిబ్బంది శుభ్రం చేయడం లేదనడానికి ఇది నిదర్శనం. పేరుకుపోయిన మురుగునీటి కాలువల నుంచి వచ్చే దుర్వాసనతో ప్రజలు రోగాల పాలవుతున్నారు. ఇలాంటి పరిస్థితి జిల్లా వ్యాప్తంగా ఉంది.

- చెత్తాచెదారం.. పందుల విహారం
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): అసలే వర్షాకాలం.. నిన్న, మొన్నటి వరకు గెరువు ఇవ్వకుండా ఐదు రోజుల పాటు కురిసిన వర్షానికి పల్లెల్లో పారిశుధ్య పనులు పడకేశాయి. డ్రైనేజీలు నిండిపోయి రోడ్లపైకి ప్రవహిస్తుంది. ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలు కంపుకొడుతున్నాయి. జిల్లాలోని రెండు మున్సిపాలిటీల్లోనూ పరిస్థితులు అధ్వానంగా ఉన్నాయి.

ప్రత్యేక పాలన.. కనిపించని అధికారులు
జిల్లాలోని 255 గ్రామపంచాయతీలు, మండల పరిషత్‌లలో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. ప్రత్యేకాధికారులు గ్రామాల్లో కనిపించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కొన్ని గ్రామాల్లో వారంలో రెండు రోజులు మాత్రమే ఇంటింటికీ వచ్చి చెత్త సేకరిస్తున్నట్లు సమాచారం. కొన్ని గ్రామాల్లో డంపుయార్డులు సమీపంలోనే ఉండడంతో దుర్వాసన వస్తోందని గ్రామస్తులు వాపోతున్నారు.

మున్సిపాలిటీల్లో అధ్వాన్నం
జిల్లాలోని రెండు మున్సిపాలిటీలు సిరిసిల్ల, వేములవాడల్లో డ్రైనేజీలు అధ్వానంగా ఉన్నాయి. సిరిసిల్ల పట్టణంలోని గోపాల్‌నగర్ శివాలయం, మార్కెట్ ఏరియా, సంజీవయ్యనగర్, కొత్తచెరువు, కరీంగనర్ రోడ్డు, ప్రగతినగర్ ప్రాంతాల్లోని డ్రైనేజీల్లో పిచ్చిమొక్కలు నిండిపోయి మురుగునీరు కదలడం లేదు. వేములవాడలోని శ్రీరాజరాజేశ్వర ఆలయ పరిసరాలతోపాటు కోరుట్ల జంక్షన్, పోలీస్‌స్టేషన్ ప్రాంతాల్లో డ్రైనేజీలు సరిగా లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరుతున్నారు.

మోరీలు కట్టాలి



ఎల్లారెడ్డిపేటలో పూర్తి స్థాయిలో మోరీలు కట్టాలి. కొన్ని వాడల్లో డ్రైనేజీలు లేక మోరీనీరు రోడ్డుపైన పారుతోంది. దుర్వాసనకు పందులు, కుక్కలు తిరుగుతున్నాయి. రోగాలు కూడా వత్తాన్నయి.

– భూక్య ఈరవ్వ, ఎల్లారెడ్డిపేట

జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రస్తుతం వర్షాకాలంలో ప్రజలు పరిసరాల పరిశుభ్రతపై దృష్టి పెట్టాలి. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. జ్వరాలతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. దోమలు, ఈగలపై జాగ్రత్తగా ఉండాలి. ఫ్రిజ్‌లలో నిల్వచేసిన ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి. కాచి వడబోసిన నీటిని తాగాలి. జ్వరాలు వస్తే వైద్యసిబ్బందికి సమాచారం ఇవ్వాలి.

– సారా అంజుమ్, మండల వైద్యాధికారి, ఎల్లారెడ్డిపేట

మాన్వాడలో గ్రామసభ



బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు నిర్మాణ గ్రామం మండలంలోని మాన్వాడలో నిర్వాసితుల సమస్యలపై తహసీల్దార్ కాలె నారాయణరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం గ్రామసభ నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు. అర్హులై ఉండి గెజిట్ కాని పలువురు గెజిట్ పబ్లికేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. పలువురు యువతీ, యువకుల పరిహారం, ప్యాకేజీ కోసం దరఖాస్తులు అందించారు. వివిధ సమస్యలపై 401 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఎంపీడీవో భీమ జయశీల, పంచాయతీ కార్యదర్శి రాజశ్రీ, మాజీ సర్పంచు రామిడి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ప్రకృతి పరిరక్షణతోనే మానవ మనుగడ



సిరిసిల్లకల్చరల్: ప్రకృతి పరిరక్షణతోనే మానవ మనుగడ ఆధారపడి ఉందనే విషయాన్ని విద్యార్థులు విస్మరించరాదని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శ్రీనివాస్ పేర్కొన్నారు. విధిగా మొక్కలు నాటి, సంరక్షించాలని కోరారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సోమవారం మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ కనకశ్రీ విజయ రఘునందన్ తదితరులు ఉన్నారు.

'నానో'య్ వచ్చేసింది

- మార్కెట్‌లోకి ద్రవరూప ఎరువులు
- ఖర్చు తక్కువ.. దిగుబడి ఎక్కువ

చందుర్తి(వేములవాడ): తక్కువ పెట్టుబడి.. ఎక్కువ దిగుబడి లక్ష్యంగా పలు కంపెనీలో నానో(ద్రవ రూప) ఎరువులను మార్కెట్‌లో తీసుకొచ్చాయి. రెండేళ్ల క్రితమే ఇఫ్కో నానో యూరియాను తీసుకురాగా.. మిగతా కంపెనీలు సైతం అదే బాటలో నడిచాయి. తాజాగా నానో డీఏపీ సైతం అందుబాటులోకి వచ్చింది. వీటితో ఎరువుల వినియోగం మరింత సులభం కానుంది. ప్రస్తుతం 50 కిలోల డీఏపీ బస్తా ధర రూ.1,350 ఉండగా, నానో డీఏపీ ధర అర లీటరుకు రూ.600లకు విక్రయించనున్నారు. యూరియా బస్తా ధర రూ.266 ఉండగా నానో యూరియా ధర అర లీటరు రూ.240 ఉంది. ఇప్పటి వరకు బస్తాలో ఉండే డీఏపీ ఎరువును వరినాటు వేసే సమయంలో పొలం మొత్తం చల్లేవారు. కానీ నానో డీఏపీతో ఈ సమస్య ఉండదు. అందుకే రైతులు వీటి వినియోగంపై దృష్టి పెడుతున్నారు.

రవాణా, కూలీల ఖర్చులు ఆదా
యూరియా బస్తాపై అంతర్జాతీయ ధర రూ.2,450 ఉండగా కేంద్ర ప్రభుత్వం రూ.2,183.50 రాయితీ ఇస్తోంది. రాయితీ పోను రైతుకు బస్తా రూ.266లకే లభిస్తుంది. ఇప్పుడు రూ.240లకే 500మి.లీ నానో యూరియా సీసా మార్కెట్‌లో లభిస్తోంది. దీంతో రైతుకు ఒక్క బాటిల్‌పై రూ.26 ఆదా అవుతుంది. డీఏపీ ధర అంతర్జాతీయ మార్కెట్‌లో రూ.4,073 ఉండగా కేంద్రం రూ.2,501 రాయితీ భరిస్తుండడంతో రైతుకు రూ.1350లకు లభిస్తుంది. నానో డీఏపీ అర లీటరు రూ.600. ఒక్క డీఏపీ బస్తా ఎంత విస్తీర్ణానికి వినియోగిస్తామో.. అర లీటరు నానో డీఏపీ అంతే విస్తీర్ణానికి సరిపోతుండడంతో రైతుకు ఒక్క బాటిల్‌పై రూ.750 భారంతోపాటు రవాణా ఖర్చులు కలిసొస్తున్నాయి. ద్రవరూప ఎరువులను నిల్వ చేసుకోవడం కూడా చాలా సులవు. దీన్ని పర్యావరణానికి కూడా ఎలాంటి హానీ కలుగకుండా ఉత్పత్తి చేయవచ్చు.



నానో యూరియా, డీఏపీ బాటిల్స్

నానో ఎరువుల ప్రయోజనం
ద్రవరూప ఎరువులు చిన్న పరిమాణంలో కలిగి ఉండడం ద్వారా పంటకు 80 శాతం కన్నా ఎక్కువగా ఉంటుంది. ఇది మొక్కల నత్రజని అవసరాన్ని సమర్థంగా తీరుస్తూ ఆకుల్లో కిరణజన్య సంయోగ క్రియను పెంచుతుంది. వేళ్లలో కణజాలాన్ని వృద్ధి చేస్తుంది. ఉపయోగకరమైన పిలకలను, శాఖలను పెంచుతుంది. మొక్కల్లో నత్రజని, ఇతర పోషకాలను తీసుకునేందుకు సమీకరించటానికి మార్గాలను ప్రేరేపిస్తుంది.

ఉపయోగించే విధానం
నీటి సమరూపంలో కలిపిన 4 శాతం నత్రజని కలిగి ఉంటుంది. నానో యూరియాలో ఉన్న నత్రజని మొక్కల లోపలి నీటిలో కలిసిన తురవాత అమ్మోనికల్, నైట్రేట్ ద్రవరూపంలోకి మారుతుంది. లీటరు నీటికి 2 మిల్లీలీటర్లు లేదా 4 మిల్లీలీటర్లు చొప్పున కలుపుకుని పంట పెరుగుదల దశలో ఆకులపై పిచికారీ చేయాలి. ఉత్తమ ఫలితాలు కోసం మొదటి పిచికారీ పిలకదశ, పెరుగుదల దశలో, తర్వాత 20–25 రోజులకు అంటే పూతదశలో రెండో పిచికారీ చేయాలి.

బాటిల్‌తో కష్టం తప్పింది



పంట పొలాలకు యూరియా వేయాలంటే బస్తాను పొలం వరకు తీసుకపోవడం పెద్దకష్టంగా ఉండేది. వర్షాకాలంలో పొలాల కాడికి తీసుకెళ్లేందుకు దారి సరిగ్గా ఉండక తిప్పలు పడేవారం. ఇప్పుడు బాటిల్ (నానో ద్రవరూప) యూరియాను తీసుకెళ్లడం చాలా సులువు.

– తాడిశెట్టి తిరుపతిరెడ్డి, బండపల్లి

నీటిలో కలిపి వినియోగించాం



పత్తి, మొక్కజొన్న పంటలకు యూరియా వేసేందుకు ఎక్కువ సమయం పట్టేది. ఇతర క్రిమిసంహారక మందులతోపాటు యూరియాను నీటిలో కలుపుకుని వాడుకునే వాళ్లం. యూరియా బాటిల్ రూపంలో రావడంతో వినియోగించుకోవడం సులువుగా మారింది. బాటిల్ మందు మిగిలితే భద్రపర్చుకోవడం కూడా చాలా సులువు.

– అంబిరి కమలాకర్, కిష్టంపేట

ద్రవరూప ఎరువులతో ప్రయోజనమే

ద్రవరూప యూరియా, నానో డీఏపీలు మార్కెట్‌లోకి వచ్చాయి. రైతులు పంటలపై వినియోగిస్తే క్షేత్రస్థాయిలో పరిశీలించాను. ఆశించిన ప్రయోజనం ఉంది. మొక్కకు పిచికారీ చేసుకుంటే నత్రజని నేరుగా అందుతుంది. పంట పైరుకు వచ్చే దశలో పిచికారీ చేసుకుంటే దిగుబడి 8 శాతం వరకు పెరుగుతుంది. నానో డీఏపీ కూడా అదే స్థాయిలో పనిచేస్తుందను భావిస్తున్నాం. ఈ సీజన్‌లో వినియోగిస్తే రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన వస్తుంది. పెట్టుబడి భారం కూడా తగ్గుతోంది.

– శ్రీనివాస్‌రావు, ఏడీఏ, వేములవాడ

సమస్యలు విని.. అర్జీలు స్వీకరించి

- పరిష్కారానికి ఆదేశించిన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్లఅర్బన్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పలువురు బాధితులు సోమవారం కలెక్టరేట్ బాట పట్టారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా దరఖాస్తులను స్వీకరించారు. వివిధ సమస్యలపై 204 దరఖాస్తులు రాగా.. సమస్యలను పరిశీలిస్తూ పరిష్కారానికి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరు కృషిచేయాలని సూచించారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

ఐదెకరాలు, రూ.3లక్షలు ఇప్పించండి



నాది వీర్నపల్లి మండలం గర్జనపల్లి. నేను 1998 నుంచి 2003 వరకు పీపుల్స్‌వార్‌లో మద్దిమల్ల ఏరియా సీవోగా పనిచేశాను. 2003లో జనజీవన స్రవంతిలో కలిశాను. లొంగిపోయిన నక్సలైట్లకు అప్పటి ప్రభుత్వం పునరావసం కింద 5 ఎకరాల భూమి, రూ.3లక్షలు ఇస్తామని ప్రకటించింది. కానీ ఇప్పటి వరకు నాకు ఏమీ అందలేదు. నాకు రివార్డు ఇప్పించి ఆదుకోండి.

– గుంటుక రవి అలియాస్ అశోక్

పెండింగ్ వేతనాలు ఇప్పించండి



మేము ఎస్సీ సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నడిచే హాస్టళ్లలో నైట్‌వాచ్‌మెన్, కుక్, కమాటీలుగా పనిచేస్తున్నాం. గత పది నెలలుగా మాకు వేతనాలు ఇవ్వడం లేదు. పెండింగ్ వేతనాలు ఇప్పించి ఆదుకోండి.

– జిల్లాలోని ఎస్సీ హాస్టల్స్ కార్మికులు

కాలువ కబ్జా చేసిండ్రు



ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లతిమ్మాపూర్ పరిధిలోని దసబొండ నుంచి జక్కుల చెరువులోకి వెళ్లే కాలువను కొందరు కబ్జా చేశారు. దీంతో నీరు 30 మంది రైతుల పొలాల్లోకి వస్తోంది. పంట నష్టపోతున్నాం. కాల్వ తీయాలి.

– రాచర్ల తిమ్మాపూర్ గ్రామస్తులు

సదరం పాత ఐడీని రద్దు చేయండి



నేను గతంలో వినికిడి సమస్యతో బాధపడేవాన్ని. సదరం క్యాంపునకు వెళ్తే 35 శాతంతో సర్టిఫికెట్ ఇచ్చారు. తర్వాత ప్రమాదవశాత్తు ఇంటిపై నుంచి కిందపడడంతో నా రెండు కాళ్లు విరిగాయి. నడవలేని స్థితిలో ఉన్నాను. పాత సదరం ఐడీ (22050191901120002) చూపిస్తుంది. పాత ఐడీని తొలగించి, కొత్తగా సదరం క్యాంపు కోసం స్లాట్ బుక్‌చేసుకునే అవకాశం కల్పించండి.

– కుమ్మరి దిలీప్‌కుమార్, మర్రిమడ్ల

ఇందిరమ్మ బిల్లు ఇప్పించండి



పాత పెంకుటిల్లు కూల గొట్టి వాస్తు ప్రకారం 750 ఫీట్లు పెట్టి బేస్‌మెంట్ కట్టినం. హౌసింగ్ ఏఈ, గ్రామపంచాయతీ కార్యదర్శి వచ్చి ఇలా అయితే నడవదని బేసిమెంట్‌ను తగ్గించి 562 ఫీట్ల బేస్‌మెంట్‌కు ఫొటో తీసుకున్నారు. మాకు ఇంత వరకు బిల్లు రాలేదు. మాకన్న ఎక్కువ ఫీట్లు పెట్టి ఇల్లు కట్టుకున్న వారికి బిల్లులు వచ్చినవి. మాకు తగిన న్యాయం చేయండి.

– మసురకంటి వెంకటలక్ష్మి, రాళ్లపేట

అర్హత పత్రాలు అందజేయాలి



మా గ్రామంలో 20 మంది కుటుంబాలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు మంజూరు చేశారు. అందులో 8 కుటుంబాలు ఇండ్లు నిర్మించుకున్నారు. కానీ వారికి అర్హత పత్రాలు ఇప్పటి వరకు ఇవ్వలేదు.

– సిరికొండ గ్రామస్తులు, ఇల్లంతకుంట

మా సార్‌ను మా బడికే పంపండి



ఇల్లంతకుంట: మాది దాచారం. మా ఊరి ప్రాథమిక పాఠశాలలో 107 మంది విద్యార్థులకు ముగ్గురు టీచర్లు ఉన్నారు. మా బడి నుంచి డిప్యూటేషన్‌పై పంపిన ఉపాధ్యాయుడిని తిరిగి మా ఊరికే కేటాయించాలి.

– దాచారం గ్రామస్తులు

హామీలు నెరవేర్చి ఎన్నికల్లోకి రావాలి

- స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేస్తాం
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య



మాట్లాడుతున్న తోట ఆగయ్య, పార్టీ నాయకులు

సిరిసిల్లఅర్బన్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చిన తర్వాతనే ఎన్నికల్లోకి రావాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య డిమాండ్ చేశారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆంధ్రవాళ్లకు తాకట్టు పెడుతున్నారన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు దిమ్మతిరిగే ఫలితాలు బీఆర్ఎస్ సాధిస్తుందని సవాల్ విసిరారు. ఆంధ్రకు చెందిన సీఎం రమేశ్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కుమ్మక్కై కేటీఆర్‌ను విమర్శించినంత మాత్రాన నాయకుడు కాలేడన్నారు. అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్నా ప్రజలకు మెరుగైన సేవలు అందించకుండా బీఆర్ఎస్‌పై తప్పుడు ఆరోపనలు చేస్తూ పబ్బం గడుపుతోందని విమర్శించారు. మేడిగడ్డను రిపేరు చేసి ఉంటే రైతులకు సాగునీటికి ఇబ్బంది ఉండేది కాదన్నారు. గజభీంకార్ రాజన్న, న్యాలకొండ రాఘవరెడ్డి, దార్ల సందీప్, కృష్ణారెడ్డి, మనోజ్‌కుమార్, రవిగౌడ్, అమర్‌రావు, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కేంద్రీయ విద్యాలయం ప్రారంభం



సిరిసిల్లఅర్బన్/తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలం పద్మనగర్ గ్రామ పంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మించిన కేంద్రీయ విద్యాలయాన్ని మంగళవారం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని సిరిసిల్లకు అప్పటి కరీంనగర్ ఎంపీ, ప్రస్తుత రాష్ట్ర బీసీ రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ 2013లో కేంద్రీయ విద్యాలయం కోసం ప్రతిపాదించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత 2015లో కేంద్రీయ విద్యాలయం మంజూరైంది. అప్పటి నుంచి సిరిసిల్లలో కొనసాగింది. ఒకటి నుంచి 10వ తరగతి వరకు ఒక్కో తరగతిలో 50 సీట్లను కేటాయించింది. దీనికి సంబంధించిన ఉపాధ్యాయులు, సిబ్బంది అవసరమైన వసతులు కల్పించారు. ప్రస్తుతం తంగళ్లపల్లి మండలం పద్మనగర్ గ్రామపంచాయతీ పరిధిలో అధునాతన అంగులతో నిర్మించిన నూతన భవనం 2025, ఏప్రిల్ నుంచి అందుబాటులోకి వచ్చింది. ఈ భవనం నేడు ప్రారంభంకానుంది. విద్యాలయం ప్రారంభోత్సవానికి కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి డాక్టర్ సుకంతా మజుందర్, కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్, కేంద్ర విద్యాశాఖ సహాయమంత్రి (స్వతంత్ర ఇన్‌చార్జి) జయంత్ చౌదరీలు హాజరుకానున్నారు.

క్లుప్తంగా

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య


మృత దేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై నరేందర్‌రెడ్డి

గన్నేరువరం(మానకొండూర్): మండల కేంద్రంలో అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపారు. పబ్బతి చంద్రయ్య (40) ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లి ఐదునెలల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. అప్పుల బాధతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి ముందున్న చెట్టుకు ఉరేసుకున్నాడు. భార్య ప్రమీల ఫిర్యాదుతో సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

అమెరికాలో సింగరేణి కార్మికుడి మృతి

- ఇండియాకు శవాన్ని తీసుకొచ్చే యత్నంలో బంధువులు


పెరక ప్రకాశ్ (ఫైల్)

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్‌–3 పరిధిలోని ఓసీపీ–2లో పని చేస్తు గోదావరిఖనిలో పవర్ హౌస్ కాలనీలో నివాసముంటున్న పెరక ప్రకాశ్(54) అమెరికాలో ఇటీవల మృతి చెందాడు. ఆయన కూతురు అమెరికాలోని అస్టిన్ నగరంలో ఉండగా.. అక్కడికి వెళ్లి మరణించాడు. మృతదేహాన్ని ఇండియాకు పంపించడానికి అక్కడి బంధువులు గోఫండ్‌మీ పేజీ ఏర్పాటు చేసి సాయంకోసం ఎదురుచూస్తున్నారు. అక్కడి తానా ప్రతినిధులతో మాట్లాడి శవాన్ని గోదావరిఖనికి తీసుకురావాలనే యోచనలో బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు ఉండగా, చిన్న కూతురి వద్దకు వెళ్లిన సమయంలో ఈసంఘటన జరిగింది.

గంజాయి తరలిస్తున్న బాలుడిపై కేసు

వెల్గటూర్: గంజాయి తరలిస్తున్న బాలుడిపై కేసు నమోదు చేసినట్లు వెల్గటూర్ ఎస్సై ఉమా సాగర్ తెలిపారు. మండలంలోని మొక్కట్రావుపేట శివారులో పోలీస్ సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ బాలుడు అనుమానాస్పదంగా కనిపించాడు. అతడిని తనిఖీ చేయగా 110 గ్రాముల గంజాయి దొరికింది. బాలుడిది ముత్తునూర్ గ్రామంగా గుర్తించారు. బాలుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

ఏడుగురిపై..

మెట్‌పల్లి: మెట్‌పల్లి క్లబ్ సొసైటీ స్థల విక్రయ వ్యవహారంలో ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ సోమవారం తెలిపారు. క్లబ్ ఆస్తులను గుట్టుగా విక్రయించి మోసానికి పాల్పడుతున్నారని దొంతుల వెంకటేశ్వర్‌రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అధ్యక్షుడు చెట్లపల్లి నరేందర్‌గౌడ్‌వ గంగుల వివేక్, వేములకిషన్, దొంతుల సుధాకర్, వేముగంటి భూమేశ్వర్, నీల రాజు, వేముల అశోక్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఎస్సారెస్పీపైనే ఆశలు

- భారీ వర్షాలు కురిస్తేనే ప్రాజెక్టులోకి నీరు
- 23.866 టీఎంసీలకు చేరిన నీటిమట్టం
- నీరు విడుదల చేయాలని రైతుల డిమాండ్


ఎస్సారెస్పీ ప్రాజెక్టు

జగిత్యాల అగ్రికల్చర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు సాగు, తాగునీరు అందించే శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరద చేరుతోంది. ఆయకట్టుకు విడుదల చేసేస్థాయిలో ప్రాజెక్టు నీటిమట్టం పెరగకపోవడంతో, నీటి విడుదలపై సందిగ్ధం నెలకొంది. మొన్నటి వరకు వర్షాలు లేక, పంటలు ఎండిపోతుండటంతో నీరు విడుదల చేయాలని జిల్లాలోని కథలాపూర్, మెట్‌పల్లి రైతులు ఆందోళనకు దిగారు.

➡ ఎగువప్రాంతాల్లో వర్షాలు అంతంతే

ఎస్సారెస్పీ ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో వర్షాలు పెద్దగా లేకపోవడంతో నీరు చేరడం లేదు. రెండేళ్లలో జూలై నెలలోనే ప్రాజెక్టు నిండింది. జిల్లా ఆయకట్టు రైతులకు రెండు పంటలకు సాగునీరు ఇచ్చారు. ప్రాజెక్టుకు చెందిన కాకతీయ, సరస్వతి, లక్ష్మీ కాలువలకే కాకుండా వరదకాలువకు సైతం పలుమార్లు నీటిని వదిలారు. ప్రాజెక్టు నిండిన తర్వాత ఐదారుసార్లు గేట్లు ఎత్తి వరదను గోదావరిలోకి వదిలారు.

➡ జిల్లాలో 4.50 లక్షల ఎకరాల్లో సాగు

జగిత్యాల జిల్లాలో వానాకాలం సీజన్‌లో దాదాపు 4.50 లక్షల ఎకరాల్లో పంటలు సాగుకానున్నాయి. ఇందులో వరి 3 లక్షల ఎకరాల్లో సాగుచేసే అవకాశముంది. వరికి సాగునీటి అవసరం ఎక్కువ. ప్రస్తుతం వ్యవసాయ బావుల్లో ఉన్న నీటితోనే వరి నాట్లు వేస్తున్నారు. ప్రాజెక్టు నిండుతుందనే ఆశతో రైతులు సాగు చేస్తున్నారు. ఇప్పుడే వరద వచ్చే అవకాశం లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ బావుల్లో ఉన్న నీరు సైతం ప్రధాన పొలం దున్నేందుకు సరిపోవడం లేదని చెపుతున్నారు. లక్షన్నర ఎకరాల్లో సాగయ్యే మొక్కజొన్న, పసుపు పంటలకు వర్షం నీరు సరిపోతుంది. తప్పని పరిస్థితుల్లో డ్రిప్ ద్వారా సాగునీరు అందిస్తున్నారు.

➡ ప్రాజెక్టులో 23.866 టీఎంసీలు

ఎస్సారెస్పీ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1091.00 అడుగులు కాగా, ప్రస్తుతం ప్రాజెక్టులో 1070.30 అడుగుల నీరుంది. నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీ(గతంలో 90.3 టీఎంసీ)లకు ప్రస్తుతం 23.866 టీఎంసీలు ఉంది. ప్రాజెక్టులోకి ఈ సీజన్‌లో జూన్ 1 నుంచి 13.045 టీఎంసీల నీరు చేరింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో సగటున ప్రాజెక్టులోకి 10,484 క్యూసెక్కుల నీరు చేరుతోంది. గతేడాది ఈ సమయానికి ప్రాజెక్టు నీటి మట్టం 1073.60 అడుగులు ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 29.933 టీఎంసీలుగా ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 50,503 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. 622 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో వెళ్తోంది.కాగా.. కథలాపూర్, మెట్‌పల్లి ప్రాంత రైతులు ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయాలని ఆందోళన చేస్తున్నారు.

ఎదురుచూస్తున్నాం



ఎస్సారెస్పీ ప్రాజెక్టు జిల్లాకు వరప్రదాయినీ. ఈ ప్రాజెక్టు ద్వారా జగిత్యాల జిల్లాకే ఎక్కువ నీరు అందుతుంది. ప్రాజెక్టు నీరు రాకపోతే పంటలు సాగుచేయడం కష్టం. చాలామంది వరినాట్లు వేసి ఎస్సారెస్పీ నీటి కోసం ఎదురుచూస్తున్నారు.
– వేముల కరుణాకర్, ధర్మపురి

ప్రాజెక్టు నిండాలి



ఖరీఫ్ సీజన్‌కు ఆన్, ఆఫ్ పద్ధతిలో ఎస్సారెస్పీ నీరు విడుదల చేయాలి. ఇప్పటి వరకు వ్యవసాయ బావిలో ఉన్న నీటితో నాట్లు వేసుకున్నాం. బావుల్లో సరిపోయేంత నీరు లేదు. ప్రాజెక్టు తొందరగా నిండి, వానాకాలం, యాసంగి పంటలకు నీరు అందించాలి.
– నక్కల తిరుపతి రెడ్డి, తొంబరావుపేట, మేడిపల్లి



కోడె మొక్కులు... సత్యనారాయణ వ్రతాలు

వేములవాడ: శ్రావణమాసం సోమవారం కావడంతో వేములవాడ రాజన్నను దర్శించుకునేందుకు 45 వేల మంది భక్తులు తరలివచ్చారు. కోడెమొక్కులు చెల్లించుకున్నారు. కళాభవన్‌లో సత్యనారాయణ వ్రతాలు, కల్యాణాల మొక్కులు చెల్లించుకున్నారు.




రోడ్డు విస్తరణ పనులను ప్రారంభించండి

- కేంద్ర మంత్రి గడ్కరీకి బండి సంజయ్ వినతి


కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి వినతిపత్రం అందజేస్తున్న బండి సంజయ్

కరీంనగర్‌టౌన్: పెండింగ్‌లో ఉన్న కరీంనగర్–జగిత్యాల రోడ్డు విస్తరణ పనులను వెంటనే ప్రారంభించాలని కోరుతూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఢిల్లీలో నితిన్ గడ్కరీని కలిసిన ఆయన కరీంనగర్–జగిత్యాల విస్తరణ పనులతో పాటు సెంట్రల్ రోడ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ఫండ్స్ (సీఆర్ఐఎఫ్) మంజూరు అంశాలపై చర్చించారు. కరీంనగర్ నుంచి జగిత్యాల వరకు ఫోర్‌లేన్ విస్తరణకు ఎన్నికలకు ముందే కేంద్రం రూ. 2151 కోట్ల 35 లక్షల నిధులతో ప్రతిపాదనలు రూపొందించిన విషయాన్ని గుర్తుచేశారు. త్వరలోనే విస్తరణ పనులకు శ్రీకారం చుడతామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో పలు రోడ్ల విస్తరణ పనులకు సంబంధించి ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయని, దీనిని దృష్టిలో పెట్టుకుని సెంట్రల్ రోడ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (సీఆర్ఐఎఫ్) ను విడుదల చేయాలని కోరుతూ వినతిపత్రం అందించారు. మొత్తం రూ.113 కోట్లతో కూడిన సీఆర్ఐఎఫ్ ప్రతిపాదనలను గడ్కరీకి సమర్పించారు. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం బావుపేట–ఖాజీపూర్ రోడ్డులో భాగంగా మానేరు నదిపై హై లెవల్ బ్రిడ్జితోపాటు గన్నేరువరం మండలం గుండ్లపల్లి–పొత్తూర్ రోడ్డు విస్తరణ పనులు, చందుర్తి నుంచి మోత్కురావుపేట వరకు వంతెనల నిర్మాణ పనులు, కిష్టంపల్లి వరకు రోడ్డుపై వంతెన నిర్మాణం, శంకరపట్నం మండలం అర్కండ్ల (గ్రామం) నుంచి కన్నాపూర్ (గ్రామం) వరకు వరద కాలువపై హై లెవల్ వంతెన నిర్మాణ ప్రతిపాదనలు వీటిలో ఉన్నాయి. దీనికి సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి గడ్కరీ త్వరలోనే సీఆర్ఐఎఫ్ నిధులు విడుదలపై నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

సరస్వతీ పుత్రునికి అందిన లక్ష్మీకటాక్షం

- ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లిన పీఏ మురళీధర్ రెడ్డి
- స్పందించి సాయం చేసిన నేతలు


చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

తిమ్మాపూర్: కూలిపనులు చేసుకుంటూ బతికే మానకొండూరు మండలం గంగిపల్లి గ్రామానికి చెందిన చంద్రకళ–శంకర్ దంపతుల కొడుకు మహేశ్ గత ఎప్రిల్‌లో విడుదలైన జేఈఈ మెయిన్స్‌లో ఆల్ ఇండియా 453 (ఎస్సీ విభాగంలో 17)వ ర్యాంకు సాధించాడు. తమిళనాడులోని తిరుచిరాపల్లి ఎన్ఐటీలో ఆర్కిటెక్చర్ సీటు దక్కించుకున్నాడు. ఫీజుకట్టలేని పరిస్థితిలో తల్లిదండ్రులు ఉండడంతో మహేశ్ విద్యకు దూరమయ్యే ప్రమాదం ఏర్పడింది. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే సత్యనారాయణ పీఏ మురళీధర్ రెడ్డి విద్యార్థికి ఎలాగైనా సహాయం చేయాలని తలిచి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన, కాంగ్రెస్‌పార్టీ నాయకులు, అధికారుల సహకారంతో రూ.3.30 లక్షలు సమీకరించారు. సోమవారం స్థానికంగా ఏర్పాటుచేసిన ఓ కార్యక్రమంలో విద్యార్థి మహేశ్‌కు అందజేశారు. ఉన్నత విద్యను అభ్యసించి భవిష్యత్తులో పేదలకు సాయం చేయాలని, విద్యార్థికి ఆర్థిక సాయం చేసిన దాతలు అభినందించారు. కార్యక్రమంలో తిమ్మాపూర్ సీఐ సదన్ కుమార్, తహసీల్దార్లు శ్రీనివాసరెడ్డి, విజయ్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ పులికృష్ణ, కాంగ్రెస్ నాయకులు ఎస్ఎల్ గౌడ్, ఒగ్గు దామోదర్, బండారి రమేశ్, తుమ్మనపల్లి శ్రీనివాస్ రావు, మోరపల్లి రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆడుకుంటూ వెళ్లి.. నీటిబకెట్‌లో పడి..


సాన్వీ(ఫైల్)

జూలపల్లి(పెద్దపల్లి): సరదాగా ఆడుకుంటూ వెళ్లిన చిన్నారి గుండు సాన్వీ(21నెలలు) నీటిబకెట్‌లో పడి చనిపోయింది. పెద్దపల్లి జిల్లా పెద్దాపూర్ గ్రామంలో ఈ విషాదకర ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పెద్దాపూర్ గ్రామానికి చెందిన గుండు సతీశ్ – రవళి దంపతులు. వీరికి ఒక మారుడు, ఒక కూతురు ఉన్నారు. కొడుకు పెద్దవాడు, కూతురు సాన్వీ ఇంట్లో సందడిచేస్తూ ఉండేది. ఈక్రమంలోనే ఈనెల 27న రాత్రి 7.00 గంటల సమయంలో ఇంట్లో ఆడుకుంటోంది. చిన్నారి తల్లిదండ్రులు ఇంటి పనుల్లో నిమగ్నయ్యారు. అయితే, ఇంట్లో ఆడుకుంటూ క్రమంగా బయటకు వెళ్లింది. ఆ తర్వాత ఇంటి ఆవరణలోనే ఆడుకుంటూ సమీంలోని నీటి బకెట్ వద్దకు చేరుకుంది. అక్కడ నీటిని చేతితో తాకేందుకు యత్నించగా బకెట్‌లో తలకిందులుగా పడిపోయింది. ఆ వెంటనే గమనించిన చిన్నారి పెద్దనాన్న నరేశ్ కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలు తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు.

మాతృమూర్తుల కళ్లు సజీవం


సుందరమ్మ కార్నియాలను దానం చేస్తున్న కుటుంబసభ్యులు


రాజమ్మ నేత్రాలు సేకరిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

- చనిపోతూ మరికొందరికి చూపునిచ్చిన ఇద్దరు మహిళలు


భీమవరం సుందరమ్మ(ఫైల్)

సుల్తానాబాద్/కాల్వశ్రీరాంపూర్: పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్, కాల్వశ్రీరాంపూర్ మండలాలకు చెందిన ఇద్దరు మాతృమూర్తులు చనిపోతూ మరికొందరికి చూపునిచ్చారు. వివరాలు.. సుల్తానాబాద్‌లోని గాంధీనగర్‌కు చెందిన భీమవరపు సుందరమ్మ(86) వృద్ధాప్యం, అనారోగ్య సమస్యలతో సోమవారం ఇంట్లోనే చనిపోయింది. ఆమె భర్త మురహరిరావు స్వాతంత్ర్య సమరయోధుడు. అయితే, సుందరమ్మ నేత్రాలు దానం చేస్తే మరో ఇద్దరికి చూపువస్తుందని సదాశయ ఫౌండేషన్ ముఖ్య సలహాదారు నూక రమేశ్.. ఆమె కుటుంబసభ్యులను ఒప్పించారు. దీంతో ఆ మాతృమూర్తి కొడుకులు, కోడళ్లు, కూతుళ్లు, అల్లుళ్లు ఇందుకు అంగీకరించారు. ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ ప్రదీప్‌నాయక్ సహకారంతో కార్నియాలు సేకరించారు. ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, గౌరవ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, నూక రమేశ్, భీష్మాచారి, కేఎస్ వాసు తదితరులు కుటుంబసభ్యులను అభినందించారు.

మాజీ ఎంపీపీ రాజమ్మ కళ్లు దానం..

కాల్వశ్రీరాంపూర్ మండలానికి చెందిన మాజీ ఎంపీపీ ఈద రాజమ్మ(65) ఆదివారం రాత్రి చనిపోయారు. దీంతో సదాశివ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్ ఆమె కుటుంబ సభ్యులను కలిసి కళ్లు దానం చేయాలని విన్నవించారు. దీంతో వారు అంగీకరించగా, టెక్నీషియన్ ఆమె కార్నియాలు సేకరించారు. మృతురాలు భర్త, మాజీ సర్పంచ్ ఈద సత్యనారాయణరెడ్డి, కుమారుడు రఘోత్తంరెడ్డి, కూతురు మాధవి, ఏఎంసీ చైర్మన్ రామిడి తిరుపతి రెడ్డి, వైస్ చైర్మన్ రాజమల్లు, మాజీ ఎంపీపీ బాలే మల్లేశ్వరి, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ముదిగొండ అమరుల స్ఫూర్తితో ఉద్యమిస్తాం

- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ప్రసాద్


అమరులకు నివాళి అర్పిస్తున్న నాయకులు

కరీంనగర్: ముదిగొండ అమరవీరుల స్ఫూర్తితో పేదలకు ఇండ్లు, ఇళ్ల స్థలాల కోసం సమరశీల ఉద్యమాలను ఉధృతం చేస్తామని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బుర్రి ప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక ముకుందలాల్ మిశ్రాభవన్‌లో మాట్లాడారు. ముదిగొండలో పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆందోళన చేస్తే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పేదలపై తుపాకీ తూటాల వర్షం కురిపించి ఏడుగురిని కాల్చి చంపిందన్నారు. పాలకులు మారినా పేదల జీవితంలో మార్పు రావడం లేదన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చే ముందు అందరికీ ఇళ్లు ఇస్తామని హామీలను విస్మరించిందని, ఇంటి స్థలం కోసం పోరాటం చేసిన పేదలపై కేసులు పెట్టిందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని చెప్పి ఇంతవరకు ఇంటి స్థలం ఇచ్చిన పరిస్థితి లేదన్నారు. ఇప్పటికైనా పేదలందరికీ ఇళ్ల నిర్మాణం చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పార్టీ జిల్లా కార్యదర్శి వాసురెడ్డి, సుంకరి సంపత్, భూతం సారంగపాణి, వడ్ల రాజు, కవ్వంపల్లి అజయ్, మాతంగి శంకర్, రాయికంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు కొంటే బీమా


ఇఫ్కో కంపెనీ యూరియా బస్తాలు


దుర్శేడ్ సొసైటీలో నానో యూరియా సీసాలస్టాక్


నానో యూరియా సీసాలతో డీలర్

- ఇఫ్కో కంపెనీ ఆధ్వర్యంలో రైతులకు అమలు
- రూ.2లక్షల వరకు ఆర్థికసాయం

కరీంనగర్‌రూరల్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలతోపాటు ప్రైవేట్ డీలర్ల వద్ద ఎరువులు కొన్న రైతులకు కొత్తగా బీమా సౌకర్యం కల్పించారు. ఇఫ్కో ఎరువుల కంపెనీ ఉచిత సంకటహరణ బీమా పథకాన్ని అమలు చేస్తోంది. ఎరువులు కొన్న ప్రతీ రైతుకు ప్రమాద బీమా సౌకర్యం వర్తింపజేస్తారు. ఇటీవల కురిసిన వర్షాలతో వానాకాలం సీజన్ వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పనుల నిమిత్తం రైతులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈక్రమంలో రైతులు ప్రమాదాల బారిన పడితే కుటుంబాలు ఆర్థికంగా ఎంతో ఇబ్బందులకు గురికావాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. రైతులు ప్రమాదాల బారిన పడితే కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలనే ఉద్దేశంతో ఇఫ్కో ఎరువుల కంపెనీ బీమా సౌకర్యాన్ని ప్రవేశపెట్టింది. ఎలాంటి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదు. ఎరువులు కొంటే సరిపోతుంది.

రసీదు భద్రపరుచుకోవాలి

సహకార సంఘాలు, డీలర్ల వద్ద ఇఫ్కో కంపెనీ ఉత్పత్తి చేసిన ఎరువులు కొనుగోలు చేసినపుడు రసీదులను తప్పనిసరిగా తీసుకుని భద్రపరుచుకోవాలి. రైతులు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడం, నీటిలో మునిగిపోవడం, పాముకాటు, ట్రాక్టర్, హర్వెస్టర్ తదితర యంత్రాలతో ప్రమాదానికి గురైతే బీమా పరిహారం పొందే అవకాశముంది. రసీదుతోపాటు రైతు మృతికి సంబంధించి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైతే ఎఫ్ఐఆర్ కాపీ, పోస్టుమార్టం రిపోర్టు, మరణ ధ్రువీకరణ పత్రం ఇఫ్కో కంపెనీ ప్రతినిధులకు రెండునెలల్లోపు సమర్పించాల్సి ఉంటుంది.

రూ.2 లక్షల వరకు..

సహకార సంఘాలతోపాటు ప్రైవేట్ డీలర్ల వద్ద ఇఫ్కో ఎరువులు కొన్న రైతులందరికీ ప్రమాదబీమా సౌకర్యం కల్పించారు. రైతు కొనుగోలు చేసిన ఒక బస్తా, నానో ఎరువు బాటిల్‌పై రూ.10వేల బీమా, 20 బస్తాలు లేదా నానో యూరియా సీసాలు కొనుగోలు చేస్తే రూ.2 లక్షల వరకు బీమా వర్తిస్తుంది. ఎరువులు కొన్న నెల తర్వాత నుంచి ఏడాది వరకు బీమా సౌకర్యముంటుంది. రైతు మృతిచెందితే వందశాతం, రెండు అవయవాలు కోల్పోతే 50శాతం, ఒక అవయం కోల్పోతే 25శాతం బీమా పరిహారం చెల్లిస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి

సహకార సంఘాలు, ప్రైవేట్ డీలర్ల వద్ద ఇఫ్కో ఎరువులు కొన్న రైతులందరికీ బీమా సౌకర్యముంటుంది. ఎరువులు కొన్న రసీదులను భద్రపరుచుకోవాలి. గతంలో సైతం బీమా సౌకర్యముండగా పరిహారం తక్కువగా ఉండేది. ప్రస్తుత వానాకాలం సీజన్ నుంచి పరిహారం పెంచిన దృష్ట్యా రైతులు సద్వినియోగం చేసుకోవాలి.
– బి.బాలాజీ, ఇఫ్కో కంపెనీ జిల్లా మేనేజర్

గోశాల.. గోస తీరేనా.!

- మర్రిపల్లిలో 50 ఎకరాల్లో గోశాల
- అనుమతుల రాగానే నిర్మాణ పనులు
- కేబినెట్ ఆమోదంతో హర్షంవ్యక్తం చేస్తున్న భక్తులు


తిప్పాపూర్‌లోని గోశాలను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

వేములవాడరూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతో పాటు కొత్త పథకాలను ప్రవేశపెడుతోంది. రాష్ట్రంలోని గోశాలల్లో అధునాతనమైన గోశాలలను నిర్మించాలని ఇందుకు 21 ప్రాంతాలను ఎంపికచేసింది. అందులో భాగంగానే రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం పరిధిలో ఉన్న గోశాలను 50 ఎకరాల స్థలంలో నిర్మించాలని ప్రతిపాదనలు సిద్ధం చేసింది. గోవుల పోషణ, సంరక్షణకు పశుసంవర్ధక, రెవెన్యూ, దేవాదాయ శాఖల భూముల్లో ఈ గోశాలను నిర్మించాలని ఇంతకుముందు జరిగిన కేబినెట్ సమావేశంలో నిర్ణయించారు. రాజన్న ఆలయ గోశాల కోసం వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లిలోని 748 సర్వేనంబర్‌లో 50 ఎకరాల స్థలాన్ని రెవెన్యూ శాఖ అధికారులు ఇప్పటికే గుర్తించారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే ఈ ప్రాంతంలో గోశాల నిర్మించనున్నారు.

ఏటా కోట్లాది రూపాయల ఆదాయం..

రాజన్నకు భక్తులు మొక్కుబడిగా కోడెలు సమర్పిస్తారు. కొందరు ఆలయంలో కోడె మొక్కులు చెల్లించుకుంటారు. కోడె మొక్కులతో ఏటా ఆలయానికి కోట్లాది రూపాయలు ఆదాయం సమకూరుతోంది. తిప్పాపూర్‌లో మూడెకరాల స్థలంలో దాదాపు 400 కోడెలు ఉంటాయి. ఆలయంలో భక్తుల మొక్కు చెల్లింపుల కోసం సమీపంలోని గోశాల వద్ద కొన్ని కోడెలు సిద్ధంగా ఉంచుతారు. వీటి సంరక్షణ కోసం ఏఈవో స్థాయి అధికారి పర్యవేక్షణలో కోడెల బాగోగులు చూసుకుంటారు. భక్తులు పశుగ్రాసం వితరణగా అందిస్తారు. ఇటీవల వరుసగా కోడెలు మృత్యువాత పడటంతో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ప్రత్యేక దృష్టి సారించారు. రాజన్న గోశాల కోసం ప్రత్యేకంగా అధునాతనమైన గోశాల నిర్మించాలని ఎమ్మెల్యే సీఎంకు వివరించారు. స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వేములవాడ గోశాల కోసం 50 ఎకరాల స్థలం గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ క్రమంలో రెవెన్యూ శాఖ అధికారులు మర్రిపల్లిని 748 ప్రభుత్వ స్థలాన్ని 50 ఎకరాలుగా గుర్తించి అందులో హద్దులు ఏర్పాటు చేశారు.

కోడెలను సంరక్షించాలి



భక్తులు సమర్పించే నిజ కోడెలు గోశాలలోనే ఉంచి సంరక్షించాలి. కోట్ల ఆదాయం ఉన్న ఆలయానికి కోడెల సంరక్షణ సమస్య కాదు. వాటి కోసం ప్రత్యేక నిధులు, సిబ్బందిని కేటాయించి వాటి బాగోగులు చూడాల్సిన బాధ్యత ఆలయ అధికారులపై ఉంది.
– గడప కిశోర్‌రావు, విశ్వహిందూ పరిషత్ సహాయ కార్యదర్శి, కరీంనగర్ జిల్లా

50 ఎకరాల్లో నిర్మాణం



రాజన్న ఆలయానికి ఏటా రూ.123 కోట్ల 76 లక్షల ఆదాయం వస్తుంది. దాదాపు 68 శాతం కోడెమొక్కుల ద్వారా సమకూరుతుంది. కోడెల సంరక్షణకు గత ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. మర్రిపల్లి శివారులో గోశాల కోసం 50 ఎకరాల్లో నిర్మించేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది.
– చిలుక రమేశ్, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి